## 2,53 లక్షల మంది ఖాతాల్లో రూ.201 కోట్లు జమ

### కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): రైతు భరోసా కింద ఇప్పటివరకు జిల్లాలో 2,53, 020 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.201 కోట్లు జమయ్యాయని కలెక్టర్ రాహుల్ రాజ్ శనివారం ప్రకటనలో తెలిపారు. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం రైతుభరోసా పథకాన్ని ప్రారంభించిందన్నారు. అర్హులైన రైతులకు ఎకరానికి (రెండు విడతల్లో) రూ.12వేలు పంట పెట్టుబడి సాయం అందిస్తుందని పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తి చేస్తాం: కలెక్టర్


ఇంటి పనులు ప్రారంభించిన కలెక్టర్


విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కొల్చారం, జూన్ 21: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తామని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం సంగాయిపేటలో పర్యటించారు. ఓ లబ్ధిదారుడి ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించారు. నియోజకవర్గంలో 3500 ఇండ్లు మంజూరయ్యాయన్నారు.

### పౌష్టికాహారం అందించాలి

అంగన్‌వాడీలో పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని కలెక్టర్ అన్నారు. సంగాయిపేట అంగన్‌వాడి సెంటర్, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో హాజరు పట్టిక, రిజిస్ట్రర్లు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, నోట్, పాఠ్య పుస్తకాలు అందించాలన్నారు. అంగన్‌వాడీ విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో రఫీకున్నిసా, ఎంపీవో కృష్ణ వేణి ఉన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

వెల్దుర్తి, జూన్ 21: అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని బీఆర్‌ఎస్ అందుగులపల్లి నాయకుడు వడ్ల నర్సింలు అన్నారు. శనివారం పలువురు లబ్ధిదారులు ఇండ్లకు ముగ్గుపోశారు. గ్రామంలో తొమ్మిది ఇండ్లు మంజూరయ్యాయని, వీటి నిర్మాణానికి భూమిపూజ చేశారన్నారు. మరికొంత మంది లబ్ధిదారులు కూడా ఇండ్లు మంజూరు చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు.

## పీవోఎస్ యంత్రాలతోనే ఎరువులు విక్రయించాలి


పీఓఎస్ యంత్రాలను పంపిణీ చేస్తున్న డీఏవో

### -జిల్లా వ్యవసాయాధికారి వినయ్ కుమార్

మెదక్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఎరువుల అమ్మకం ఈపాస్ యంత్రాల ద్వారా మాత్రమే చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వినయ్ తెలిపారు. శనివారం మెదక్ రైతు వేదికలో 150 ఈ పాస్ మెషిన్లను డీలర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 నుంచి యూరియా కాంప్లెక్స్ పొటాష్ వంటి ఎరువులను పీవోఎస్ యంత్రం ద్వారా రైతుల ఆధార్ కార్డు వివరాలను వేలిముద్రలను తీసుకుని విక్రయిస్తున్నారన్నారు. సాఫ్ట్‌వేర్‌ను ఆధునీకరించి ఎల్‌వన్ పీవోఎస్ మిషన్లను అందించామన్నారు. మెదక్, రామయంపేట డివిజన్లలోని 150 మంది ఎరువులు, అగ్రో రైతు సేవా కేంద్రాల ప్రాథమిక సహకార సంఘం డీలర్లకు అందజేశారు. కార్యక్రమంలో మెదక్ సహాయ వ్యవసాయ సంచాలకులు విజయనిర్మల, రామయంపేట ఇన్‌చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ్ నారాయణ, టెక్నికల్ ఏవో హర్ష, యాదగిరి, అధికారులు పాల్గొన్నారు.

## మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

నర్సాపూర్, జూన్21: యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో హేమభార్గవి సూచించారు. శనివారం నర్సాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నషముక్త్ భారత్‌లో భాగంగా మత్తుపదార్థాలపై అవగాహన కల్పించారు. పిల్లలను ఉత్సాహపర్చేందుకు ఆటలపోటీలు నిర్వహించారు. ఎంఈవో తారాసింగ్ పాల్గొన్నారు.

## గోదాముల్లో బియ్యం తప్పకుండా తూకం వేయాలి

### డీఎస్‌వో నిత్యానంద

నర్సాపూర్,జూన్21: రేషన్ డీలర్లకు గోదాములో బియ్యం తూకం వేసి ఇవ్వాలని డీఎస్‌వో నిత్యానంద ఆదేశించారు. శనివారం నర్సాపూర్‌లోని 32,12 రేషన్ దుకాణాలు, ఎమ్‌ఎల్‌ఎస్ పాయింట్ గోదామును తనిఖీ చేశారు. రేషన్ దుకాణాల్లో, గోదాముల్లో రికార్డులు, బియ్యం నాణ్యతను పరిశీలించారు. రేషన్ కార్డుదారులకు వంద శాతం బియ్యం పంపిణీ చేయాలని, అందుకు అవసరమైన బియ్యం గోదాంల నుంచి పంపిస్తామన్నారు. మూడు నెలల బియ్యం ఒకేసారి ఇవ్వడంతో కొంత ఇబ్బందులు అవుతున్నాయని, జిల్లాలో ఇప్పటివరకు 70 శాతం కార్డుదారులకు బియ్యం పంపిణీ చేశామని, త్వరలోనే వంద శాతం పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఈ నెల 30వ తేదీ వరకు రేషన్ షాపులు తెరిచి ఉంటాయని తెలిపారు. ఆయన వెంట రేషన్ డీలర్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, గోదాం ఇన్‌చార్జి నయీమొద్దీన్, రేషన్ డీలర్లు ఉన్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం

చిలిపిచెడ్, జూన్ 21: మండలంలోని గంగారం సబ్‌స్టేషన్ పరిధి అజ్జమర్రిలోని వ్యవసాయ పొలంలో కొన్ని రోజుల నుంచి బోరు మోటర్ ఎల్‌టీ విద్యుత్ వైరుపై 11 కేవీ విద్యుత్ వైరు ప్రమాదకారంగా ఉన్నది. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులకు రైతులు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు. 11కేవీ విద్యుత్ వైరు తెగి రెండు రోజులు అవుతున్నదని, ఏఈ, లైన్‌మెన్‌కు ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదని రైతులు నగేశ్, రాములు తెలిపారు. వైరు పశువులు, రైతులకు తాకితే పెద్ద ప్రమాదమన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి తెగిపోయిన వైరును తొలిగించాలని కోరుతున్నారు.



## పరిస్థితి విషమించి వ్యక్తి మృతి


నాగభూషణం

కొల్చారం, జూన్ 21: మండలంలోని వరిగుంతం గ్రామానికి చెందిన ఓనమాల నాగభూషణం(36) ఈ నెల 12న తన టీవీఎస్ ఎక్సెల్‌పై మెదక్ నుంచి వస్తుండగా అప్పాజిపల్లి వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్రగాయం కావడంతో హైదరాబాద్‌లోని ఓ దవాఖాన లో చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించ డంతో శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొల్చారం ఎస్‌ఐ గౌస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, SUGUNA TOLEM, R/o. 1-5-51, Sree Nagar Colony, Sangareddy, TG. Changed My Name as "SUGUNA TOLEM" to JOGA SUGUNA.

NT-Prasad

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

### నేడు మెదక్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 21: మెదక్ పట్టణంలోని జంబికుంట, ఇందిర కాలనీ, మిలటరీ కాలనీ ప్రాంతాలలో ఆదివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు, పట్టణ ఏఈ నవీన్‌లు శనివారం ప్రకటనలో తెలిపారు. జంబికుంటలో గల జిల్లా ప్రభుత్వ దవాఖానకు నిరంతరం విద్యుత్ సరఫరా అం దించేందుకు అవసరమైన పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంలో ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ సిద్ధాంత కర్తకు ఘన నివాళి


మెదక్ మున్సిపాలిటీ: జయశంకర్ సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


టేక్మాల్‌లో జయశంకర్ సార్ వర్ధంతిని నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

- బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో జయశంకర్‌సార్ వర్ధంతి

మెదక్ మున్సిపాలిటీ, జూన్21: స్వరాష్ట్ర స్వప్నికుడు, స్వతంత్ర తెలంగాణను కాంక్షించి కడవరకు ఉద్యమ వ్యూహరచన చేసి ప్రజలను చైతన్యవంతం చేసిన దార్శనికుడు, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ అన్నారు. జయశంకర్ సార్ వర్ధంతిని శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో సార్ చిత్రపటానికి ని వాళులర్పించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టి జగపతి, పార్టీ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, కో కన్వీనర్ కృష్ణాగౌడ్, లింగారెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీనివాస్, కిశోర్, జయరాజ్, మల్లేశం, నాయకులు సాధిక్, అరుణ్ ఉన్నారు.

### టేక్మాల్‌లో..

టేక్మాల్, జూన్ 21: జయశంకర్ సార్ వర్ధంతిని బీఆర్‌ఎస్ శ్రేణులు టేక్మాల్‌లో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప మాట్లాడుతూ తన శ్వాస, ధ్యాస తెలంగాణగా జీవించిన వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కొనియాడారు. కార్యక్రమంలో సిద్దయ్య, భాస్కర్, రవి, సురేశ్, సాయిలు, శ్రీశైలం, మతిన్, రాజేందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# చెత్త ఎత్తేవారెక్కడ?

- డీజిల్ లేక మూలనపడ్డ చెత్త ట్రాక్టర్లు
- పేరుకుపోతున్న చెత్తతో స్థానికుల ఇబ్బందులు
- చెత్త బుట్టలతో పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన


చిలిపిచెడ్: ఫైజాబాద్‌లో ట్రాక్టర్ ట్రాలీ చక్రం మాయం


రామాయంపేట: కాట్రియాల పంచాయతీ కార్యాలయం ఎదుట చెత్త బుట్టలతో గ్రామస్తుల నిరసన


చిలిపిచెడ్:చండూర్‌లో చెత్త కుండీలా ట్రాక్టర్ ట్రాలీ


రామాయంపేట: పంచాయతీ కార్యాలయం ఎదుట డీజిల్ లేక మూలనపడ్డ చెత్త ట్రాక్టర్

రామాయంపేట, జూన్ 21: పంచాయతీల్లో రోజువారీ చెత్త తీయకపోవడంతో పేరుకుపోతున్నది. దీంతో మహిళలు చెత్త ఎక్కడ వేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం డీజిల్‌కు పైసలివ్వక పోవడంతో ప్రస్తుత పరిస్థితుల్లో చెత్త ట్రాక్టర్లు మూలనపడ్డాయి. ట్రాక్టర్లన్నీ పంచాయతీ కేంద్రాల వద్ద మూలన పడేశారు. దీంతో ఇబ్బందులకు గురైన రామాయంపేట మండలం కాట్రియాల గ్రామ పంచాయతీ వద్ద ప్రజలు చెత్తబుట్టలతో శనివారం నిరసన తెలిపారు. చెత్తను ఎక్కడవేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నామన్నారు. గంటపాటు అక్కడే ఉండి కాంగ్రెస్ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం గ్రామాల్లో చెత్త ట్రాక్టర్లు నడిపించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పంచాయతీకో ట్రాక్టర్ మంజూరు చేశారని, అప్పుడు రోజూ చెత్తను తీసుకెళ్లేందుకు ట్రాక్టర్ వచ్చేదని, అందులో పోశామని, ఆ చెత్తను డంపు యార్డుల్లో పోసి, సేంద్రియ ఎరువులు తయారు చేసేవారని వారు తెలిపారు. ఇప్పటివరకు గ్రామం చుట్టూరా పంటలు లేక పోవడంతో ఎక్కడి వారు అక్కడ చెత్తను పోశారని, ఇప్పుడు రైతులు సాగు చేయడంతో చెత్త ఎక్కడ వేయాలో తెలియడం లేదని, ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.

### చెత్త కుండీలా ట్రాక్టర్ ట్రాలీలు

చిలిపిచెడ్, జూన్ 20: పంచాయతీ ట్రాక్టర్ ట్రాలీలు చెత్త కుండీల్లా మారాయి. పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో జీపీ ట్రాక్టర్లు నడపడం తమ వల్ల కాదని కార్యదర్శులు ఇటీవల ట్రాక్టర్ల తాళాలు వేసి అధికారులకు అప్పగించారు. చిలిపిచెడ్ మండలం చండూర్, గంగారం గ్రామాల్లో చెత్త ట్రాక్టర్ తిరగకపోవడంతో స్థానికులు తమ చెత్తను ఎక్కడ వేయాలో తెలియక పంచాయతీ కార్యాలయ సమీపంలో నిలిపిన ట్రాక్టర్ ట్రాలీలో పోసి వెళ్తున్నారు. ఫైజాబాద్‌లో జీపీ ట్రాక్టర్ ట్రాలీకి చక్రం లేకపోవడంతో నిరుపయోగంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. విషయంలో కార్యదర్శి నాగరాజు స్పందించి.. టైర్ పలిగిపోవడంతో తీసేసినట్లు తెలిపారు. కొన్ని గ్రామాల్లోని జీపీ ట్రాక్టర్లు పంచాయతీ కార్యాలయ వద్ద కనిపించడం లేదు.

### చెత్త ట్రాక్టర్‌ను గ్రామంలో తిప్పాలి



చెత్త ట్రాక్టర్‌ను ప్రభుత్వ అధికారులు గ్రామంలో తిప్పాలి. లేకుంటే చెత్త పేరుకు పోయి సీజనల్ వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉంది. గ్రామ కార్యదర్శి ఈ విషయమై స్పందించి ట్రాక్టర్‌లో డీజిల్ పోసి చెత్తను డంపుయార్డుల్లోకి వెళ్లేలా చేయాలి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కోట్ల రూపాయలను ఖర్చు చేసి చెత్తకోసం ప్రత్యేకంగా ట్రాక్టర్లను మంజూరు చేస్తే కాంగ్రెస్ సర్కార్ ట్రాక్టర్లను మూలన పడేయడం సరి కాదు. **- శ్యాములు కాట్రియాల, మాజీ సర్పంచ్, మైలారం, రామాయంపేట**

### కేసీఆర్ సారే నయం ఉండే..



చెత్త కోసం ఇబ్బందులు పడ్తున్నం. చెత్త ట్రాక్టర్ రాక పక్కనున్న పొలంలో చెత్త వేస్తున్న. సర్కారు ట్రాక్టర్లల్ల డీజిల్ పోయిస్తలేదంటుండ్రు. కేసీఆర్ సార్ ప్రభుత్వంలోనే నయముండే. రోజూ ఇంటింటికి తిరిగి చెత్త తీసుకుపోతుండే. పంటకు ముందే రైతు బంధు ఇస్తుండే.. ఈ సర్కారు వచ్చినప్పటి నుంచి ఒక్క పని అయితలేదు. పింఛన్లు పెంచుతానన్నడు పెంచలేదు. సమయానికి పింఛన్ కూడా ఇస్తలేదు. **- కనకలక్ష్మి, గ్రామస్తురాలు, కాట్రియాల, రామాయంపేట**

# ఎమ్మెల్యే సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు

### -ఎమ్మెల్యే సునీతారెడ్డికి అభినందనల వెల్లువ


రోడ్డు మరమ్మతులను దగ్గరుండి చూసుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు

నర్సాపూర్, జూన్21: అధ్వానంగా మారిన బీటీ రోడ్డును చూసి చలించిపోయి, విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగకూడదని భావించిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు చేయించారు. దీంతో పలువురు ఎమ్మెల్యేను అభినందిస్తున్నారు. నర్సాపూర్ మండలంలో ని కొండాపూర్, కాగజ్‌మద్దూర్, నత్నాయిపల్లి మీదుగా వెళ్లే బీటీ రోడ్డు గుంతలమయమైంది. దీంతో ఆర్టీసీ వారు బస్సు సౌకర్యాన్ని నిలిపివేశారు. కాగజ్‌మద్దూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు బోగ శేఖర్ గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యేకు రోడ్డు సమస్య తెలిపారు. రోడ్డు సరిగ్గా లేకపోవడంతో విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లలేకపోతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందించి ఆర్టీసీ ఆర్‌ఎంతో ఫోన్‌లో మాట్లాడారు. గుంతల్లో వెయిట్ మిక్స్ చేపిస్తే బస్సును పంపిస్తామని ఆర్‌ఎం చెప్పడంతో, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, తన సొంత నిధులతో శనివారం వెయిట్ మిక్స్ పంపి, కొండాపూర్ నుంచి షేర్‌ఖాన్‌పల్లి వరకు రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చేందుకు స్థానిక నాయకులకు తెలిపారు. సకాలంలో స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నత్నాయిపల్లి మాజీ సర్పంచ్ పరమేశ్వర్‌రాజు, కొడిప్యాక మాజీ సర్పంచ్ బాబుయాదవ్, నాయకులు అశోక్‌గౌడ్, మన్మథరెడ్డి, యాదగిరి, సత్యనారాయణ, సుదీర్, శ్రీనివాస్, ఆయా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం


రామాయంపేట: యోగాసనాలు చేయిస్తున్న యోగా గురువు మద్దెల భరత్


నిజాంపేట: చల్మెడ ప్రాథమిక పాఠశాలలో యోగాసానాలు వేస్తున్న విద్యార్థులు


టేక్మాల్: స్థానిక మోడల్ స్కూల్‌లో యోగాసనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు


నర్సాపూర్ కోర్టు ఆవరణలో యోగాసనాలు వేస్తున్న న్యాయమూర్తి హేమలత


చిలిపిచెడ్: సోమక్కపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి యోగా చేస్తున్న ఎంఈవో


మెదక్ మున్సిపాలిటీ: వైద్య కళాశాలలో యోగాసనాలు వేస్తున్న వైద్య విద్యార్థినులు

- ప్రపంచ యోగా దినోత్సవంలో పాల్గొన్న డీఈవో రాధాకిషన్
- పాఠశాలలు, కళాశాలల్లో యోగాసనాలు వేసిన విద్యార్థులు

రామాయంపేట/ మెదక్ మున్సిపాలిటీ/ నిజాంపేట/ తూప్రాన్/ టేక్మాల్/అల్లాదుర్గం/ రేగోడ్/ వెల్దుర్తి/ నర్సాపూర్/చిలిపిచెడ్, జూన్ 21: యోగా మానవాళికి గొప్ప వరం. యోగాతో శారీరక, మానసిక, వికాసంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. ఉరుకులు, పరుగుల జీవితంలో మానసిక ప్రశాంతతకు, ఆయురారోగ్యాలకు యోగాయే ఏకైక మార్గం. నిత్యం యోగా చేయడంతో ఆరోగ్యంతో పాటు ఆలోచన విధానంలో మార్పు వస్తుంది. యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని డీఈవో రాధాకిషన్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రపంచ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు.


వెల్దుర్తి: మానేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


అల్లాదుర్గం: ముస్లాపూర్ ఉన్నత పాఠశాలలో ఆసనాలు వేస్తున్న విద్యార్థులు


చేగుంట: ఎస్టీ బాలికల గురుకులంలో నిర్వహించిన యోగాలో పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్ఞానేశ్వర్


తూప్రాన్: పట్టణంలోని గీతా కళాశాలలో యోగాసనాలు వేస్తున్న పోలీసులు, విద్యార్థులు

### సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 21: హైదరాబాద్‌లో బంజారాహిల్స్‌లో ఉన్న టీఎస్ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత సివిల్స్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి శనివారం ప్రకటనలో తెలిపారు. సివిల్స్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులు జూలై 7వ తేదీలోగా tsstudycircle.co.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూలై 13న ఎంట్రన్స్ నిర్వహించి మెరిట్ ఆధారంగా వంద మందిని ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఎస్సీలకు 75 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీలకు 15 శాతం సీట్లు కేటాయిస్తామన్నారు. మహిళలకు 33 శాతం సీట్లు, దివ్యాంగులకు 5 శాతం సీట్లు కేటాయిస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 10 నెలల పాటు ఉచిత వసతితో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

### 24 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 21: పాలిసెట్25 (ఎంపీసీ స్ట్రీమ్)లో అర్హత సాధించిన విద్యార్థులకు 24 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభంకానున్నట్లు తెలంగాణ టెక్నికల్ బోర్డు కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను శనివారం ప్రకటించింది. పాలిసెట్‌లో ఉతీర్ణత సాధించిన విద్యార్థులు ఈనెల 27, 28, 29వ తేదీల్లో మెదక్‌లోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుందని ప్రిన్సిపాల్ భవాని తెలిపారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



రామాయంపేట, జూన్ 21: విద్యుత్ ప్రమాదంలో తీవ్రగాయాలై చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించి మృతి చెందిన పట్టణంలోని ఆరో వార్డుకు చెందిన గాయంతి మల్లేశం కుటుంబానికి సంఘ సేవకుడు పుట్టి సందీప్ రూ.5వేలు, 50 కిలోల బియ్యం శనివారం అందజేశారు.

### నస్కల్‌లో ఆర్థిక సాయం

నిజాంపేట, జూన్ 21: నస్కల్‌కు చెందిన సత్యం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న లీలా గ్రూప్ చైర్మన్ డా.మోహన్‌నాయక్ బాధిత కుటుంబానికి శనివారం పరామర్శించి, రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

### నిజాంపేటలో..

నిజాంపేటకు చెందిన ఖాజాభాను(42) అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న సంఘ సేవకులు చల్మేటి నరేందర్, భాగ్యలక్ష్మి బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు.

### ఫిట్‌నెస్ లేని వాహనాలకు జరిమానా



నిజాంపేట, జూన్ 21: నిజాంపేటలో ఆర్టీఏ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, స్థానిక పోలీసులు బృందంగా ఏర్పడి వాహనాలను శనివారం తనిఖీ చేశారు. తనిఖీల్లో నిజాంపేటకు చెందిన రెండు ప్రైవేట్ స్కూళ్ల బస్సులను ఫిట్‌నెస్ లేదని గుర్తించి జరిమానా విధించారు. తనిఖీల్లో ఏఎస్సై జైపాల్ రెడ్డి, ప్రసాద్, ముజీద్, అలీ ఉన్నారు.

### ఆరు నెలలైనా భోజన కార్మికులకు బిల్లులివ్వరా?



రామాయంపేట, జూన్ 21: మధ్యాహ్న భోజన కార్మికులకు ఆరు నెలలు కావస్తున్నా ప్రభుత్వం బిల్లులు ఇవ్వడం లేదని సీఐటీయూ నాయకురాలు బాలమణి విమర్శించారు. శనివారం కార్మికులతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టి, మండల వనరుల కేంద్రం సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఒక్కో ప్రభుత్వ పాఠశాలలో భోజన కార్మికులకు లక్షల రూపాయల బిల్లులు కిరాణా షాపుల్లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వ్యాపారుల వద్ద అప్పులు చేసుకుంటూ వంటలు చేస్తున్నామన్నారు. వెంటనే ప్రభుత్వం బిల్లులను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామాయంపేట, జూన్ 21: నేడు మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ ఆదయ్య, ఏఈ తిరుపతిరెడ్డి ప్రకటనలో శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రామాయంపేట ఫీడర్ పరిధిలోని కాట్రియాల సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా కాట్రియాల విద్యుత్ ఫీడర్‌లోని కాట్రియాల, దంతెపలి, పర్వతాపూర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. రామాయంపేట మండల వాసులు ఈ మూడు గంటలు సహకరించాలని ఏడీఈ ఆదయ్య, ఏఈ తిరుపతిరెడ్డి కోరారు.